సమావేశాన్ని విజయవంతం చేయాలి

- నేడు బీఆర్ఎస్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం
- మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- హాజరుకానున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, పక్కన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలీ శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు, ఏప్రిల్ 19 : కల్వకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నామని, అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీ లక్ష్మీగార్డెన్‌లో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి శుక్రవారం నియోజకవర్గంలోని అన్ని మండలాల ముఖ్య నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వస్తే వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామన్న కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. కాంగ్రెస్‌ను ప్రజలు నిలదీయాలన్నారు. రైతు రుణమాఫీని డిసెంబర్ 9న చెస్తామని చెప్పి మళ్లీ ఆగస్టు 15న మాఫీ చేస్తామనడం రైతులను మోసం చేయడమేనన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఉన్నత విద్యావంతుడని, గురుకులాల కార్యదర్శిగా పనిచేసి వేల మంది పేద విద్యార్థులను ఉన్నత ఉద్యోగాలు సాధించే విధంగా కృషి చేశారన్నారు. అలాంటి వ్యక్తిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఆమనగల్లులోని శ్రీ లక్ష్మీగార్డెన్‌లో నిర్వహించే సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరవుతారని ఆయన తెలిపారు. సమావేశంలో కడ్తాల్ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు అర్జున్‌రావు, నేనావత్ పత్యానాయక్, బీఆర్ఎస్ మాడ్గుల, కల్వకుర్తి మండలాల అధ్యక్షులు ఏమిరెడ్డి జైపాల్ రెడ్డి, సింగం విజయ్ గౌడ్, నాయకులు కొమ్ము శ్రీనివాస్ యాదవ్, లాలయ్యగౌడ్, సురమల్ల సుభాశ్, సురమల్ల సత్తయ్య, కొమ్ము ప్రసాద్, చలిచీమల సతీశ్, డేరంగుల వెంకటేశ్, లండం యాదయ్య, భాస్కర్, సుమన్ పాల్గొన్నారు.

ఐసడక్ సహకారంతో టాయిలెట్స్, అదనపు తరగుతుల నిర్మాణం

టాయిలెట్స్ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఐసడక్ రాయిలక్ టోల్ ప్లాజా బృందం, పాఠశాల ఉపాధ్యాయులు

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 19 : విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం ఐసడక్ రాయికల్ టోల్‌ప్లాజా సంస్థ సహకరించడం అభినందనీయమని ఫరూఖ్‌నగర్ మండంలోని రాయికల్ ఉన్నత పాఠశాల హెచ్ఎం జయమ్మ అన్నారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులకు బాత్‌రూంలు, మీటింగ్ హాల్, హెచ్ఎం గది నిర్మాణ పనుల కోసం ఐసడక్ రాయికల్ టోల్ ప్లాజా బృందం రూ.40 లక్షలు మంజూరు చేయనుండటం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కృష్ణయ్య, ఐసడక్ సెక్రటరీ కంపెనీ లీగల్ హెడ్ రేణుక, అగర్వాల్,ప్రాజెక్ట్ మేనజర్ ఇబ్రహీం పాల్గొన్నారు.

పాఠశాలకు బీఎస్ఎస్ఎఫ్ సంస్థ చేయూత

ప్రధానోపాధ్యాయుడికి చెక్కు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

యాచారం, ఏప్రిల్19: మండలంలోని గున్‌గల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు భారత సేవా సహకార ఫోరం (బీఎస్ఎస్ఎఫ్) సంస్థ చేయూతనిచ్చింది. పాఠశాల అభివృద్ధికి బీఎస్ఎస్ఎఫ్ సంస్థ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ సహకారంతో ఆ సంస్థ ప్రతినిధులు సాబేర్, నాగేశ్వర్‌రావు శుక్రవారం హెచ్ఎం పాండు రంగారెడ్డికి రూ.2.25 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మహ్మద్ సాబేర్ మాట్లాడుతూ..శిథిలావస్థలో ఉన్న గున్‌గల్ పాఠశాలకు పూర్వవైభవం తీసుకురావడానికి బీఎస్ఎస్ఎఫ్ సంస్థ కృషి చేస్తుందన్నారు. పాఠశాలకు రంగులు వేయడం, ప్రధానగేటు, ప్రహరీ నిర్మాణం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సంస్థ తరపున సహకారాలను అందించనున్నట్లు తెలిపారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

కడ్తాల్ : గ్రాడ్యుయేషన్ డేలో తల్లులు, చిన్నారులతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి

కడ్తాల్, ఏప్రిల్ 19 : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ-3 సెంటర్‌లో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు నుంచి ఆరు సంవత్సరాల్లోపు చిన్నారులు, వారి తల్లులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. చిన్నారులతో కథలు, పాటలు, శాస్త్రీయ పరిజ్ఞానం, సంభాషణ తదితర కార్యక్రమాలను వారి తల్లిదండ్రుల సమక్షంలో చేయించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి మాట్లాడుతూ.. ప్రీ స్కూల్ చిన్నారులను ప్రాథమిక పాఠశాలలో చేర్చడానికి సిద్ధంగా తయారు చేయనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు ప్రణాళిక ప్రకారం ప్రీస్కూల్ కార్యక్రమాలు నిర్వహిస్తూ... పిల్లల స్థితి, సంవత్సరంలో మూడుసార్లు అభివృద్ధి సూచికలు, శారీరక మానసిక, వ్యక్తిగత భావోద్వేగాలను అంచన వేస్తారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను విధిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని చిన్నారులకు అందించాలని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ యాదమ్మ, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 19 : చేవెళ్ల నియోజకవర్గంలోని మిషన్ భగీరథలో ఐఐటీ, ఎల్క్ట్రికల్, నీటి సరఫరాకు లైన్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని లియోస్ కంపెనీ ఎండీ సంపత్ శుక్రవారం తెలిపారు. మండలంలోని దామరిగిద్ద, శంకరపల్లి మండలంలోని మోకిల, షాబాద్ మండలంలోని అంతారంలోని మిషన్ భగీరథలో నీటి సరఫరా చేసేందుకు లైన్‌మెన్, ఐఐటీ, ఎలక్ట్రికల్ ఖాళీ పోస్టులు ఉన్నాయని తెలిపారు. నేటి నుంచి ఈ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8639220618, 9908120765 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

ఇబ్రహీంపట్నంరూరల్, ఏప్రిల్ 19 : ఎండలు దంచికొడుతున్నందున గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కృపేశ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఉప్పరిగూడలో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. వేసవిలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా ఉండటం కోసం మిషన్‌భగీరథ నీటి సరఫరా సక్రమంగా చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి, పంచాయతీరాజ్ ఏఈ ఇంద్రసేనారెడ్డి, ఉప్పరిగూడ పంచాయతీ కార్యదర్శి రుషిక పాల్గొన్నారు.

మాదిగలు కాంగ్రెస్‌ను ఓడించాలి

యాచారం, ఏప్రిల్ 19 : కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలను పూర్తిగా విస్మరించిందని, రానున్న ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించి తీరుతామని మాదిగ మహజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) నియోజకవర్గ ఇన్‌చార్జి కాళ్ల పాండు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ మాదిగలకు పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం సరికాదన్నారు. మాదిగల పట్ల చిన్నచూపు చూసిన రేవంత్ సర్కారుకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ముత్యాలు, ప్రచార కమిటీ కో కన్వీనర్ సతీశ్, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాళ్ల జంగయ్య, నాయకులు మూలి మహేశ్, కొండల్, మండల కన్వీనర్ శ్రీకాంత్, మహేశ్ పాల్గొన్నారు.

వడదెబ్బకు వ్యక్తి మృతి

ఆదిబట్ల, ఏప్రిల్ 19 : వడదెబ్బకు ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం జరిగింది. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా, అల్లాదుర్గం గ్రామానికి చెందిన కర్రె ముత్తయ్య(54) బొంగుళూరు గ్రామ సమీపంలో విశ్వేశ్వరయ్య కళాశాల సమీపంలో రోడ్డు పై పడి ఉన్నాడుత. అటు నుంచి వెళ్లే వారు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకొని 108కి సమాచారం ఇచ్చారు. వారు పరీక్షించి వడదెబ్బతో మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడి జేబులో ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా పోలీసులు వివరాలు తెలుసుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం సివిల్ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఆదిబట్ల, ఏప్రిల్ 19 : ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని మహిళా మృతదేహం లభ్యమైంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. తుర్కయాంజాల్ పరిధిలోని శ్రీరాం నగర్ కాలనీలో వ్యవసాయ పొలంలో ఓ గుర్తు తెలియని మహిళా(80) మృతదేహం ఉంది. చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు.

చేవెళ్ల గడ్డ.. బీసీల అడ్డా

బీఆర్ఎస్‌తోనే బీసీలకు రాజ్యాధికారం

లోక్‌సభ ఎన్నికల్లో కాసాని జ్ఞానేశ్వర్‌కు పట్టం కడుతాం

ఊరూరా కుల సంఘాలు బీసీలను చైతన్యపర్చాలి

ప్రతి బీసీ బిడ్డ ఓ సైనికుడిలా పనిచేయాలని నేతల పిలుపు



బీఆర్ఎస్‌తోనే బీసీలకు రాజ్యాధికారం సాధ్యపడుతుందని బీసీ వర్గాలు పేర్కొంటున్నాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేవెళ్ల జనరల్ స్థానంలో బీసీ వ్యక్తిని ఎంపీ అభ్యర్థిగా నిలబెట్టడమే ఇందుకు ఉదాహరణగా వారు చెబుతున్నారు. మొదటి నుంచీ కాంగ్రెస్ పార్టీతోపాటు ఆ పార్టీలోని నేతలు బీసీలను చిన్నచూపు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పాలనలో ఆగమైన బీసీల పరిస్థితిని గుర్తు చేస్తున్నారు. 'చేతనైతే బీసీ అభ్యర్థిని గెలిపించండి.. చూస్తాం..' అంటున్న కాంగ్రెస్ నేతల అహంకారపూరితమైన మాటలతో ఇకనైనా బీసీలంతా మేల్కొనాల్సిన అవసరం ఉందని కుండబద్దలు కొట్టి మరీ చెబుతున్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన కాసానికి పట్టం కట్టడం వల్ల కలిగే ప్రయోజనాలను నేతలు వివరిస్తున్నారు. బీసీ కులాలన్నీ ఏకతాటిపైకి రావడమే కాకుండా.. ఊరూరా సమావేశాలు నిర్వహించి బీసీలను చైతన్యపర్చాలని కోరుతున్నారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి బీసీ బిడ్డ ఓ సైనికుడై కృషి చేయాలని, కాసానిని గెలిపించుకుని చేవెళ్ల గడ్డ.. బీసీల అడ్డా అని నిరూపించాలని బీసీ సంఘాలు పిలుపునిస్తున్నాయి.

- రంగారెడ్డి, ఏప్రిల్ 19(నమస్తే తెలంగాణ):

బీసీలు చైతన్యం చాటాలి..

బీసీల చైతన్యం చాటే సమయం ఆసన్నమైంది. జనాభలో 50 శాతం ఉన్న బీసీలు చెట్టుకొకరు పుట్టకోకరు కావడంతో ఐక్యత కొరవడింది. బీసీలు ఎవరికి వారు చీలిపోవడంతో రాజాధికారం దిశగా వెళ్లడం లేదు. చేవెళ్ల పార్లమెంటు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్ గతంలో జడ్పీ చైర్మన్‌గా పనిచేశారు. దీంతో ఆయనకు జిల్లా మీద బాగా పట్టున్నది. బీసీ నాయకులను గెలుపించుకుంటే బీసీల హక్కుల కోసం పోరాటం చేస్తారు. ఇప్పటికైనా చేవెళ్ల పార్లమెంటు పరిధిలోని బీసీలు ఏకం కావాలి. బీసీ నేత కాసానికి ఓట్లు వేసి గెలుపించుకుందాం.

-శాపూరం రాంచంద్రయ్య, రెడ్డిపల్లి, మొయినాబాద్

బీసీల హక్కుల కోసం పోరాడేవాళ్లు కావాలి..

చేవెళ్ల పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ బీసీల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారు. బీసీల హక్కు కోసం పోరాటం చేసే వాళ్లను గెలిపించుకోవాల్సిన అవసరమున్నది. 50 శాతం ఉన్న బీసీలం మన నాయకుడిని ఎందుకు గెలిపించుకోవద్దు. బీసీల్లో సంఘాల పేరుతో వీడిపోతున్నాం. వేర్వేరు సంఘాలుగా ఉన్నా రాజకీయంగా రాణించేందుకు అందరూ ఏకం కావాలి. ఇప్పటికైనా బీసీలు మేల్కోవాల్సిన రాజ్యాధికారం దిశగా కలిసికట్టుగా ముదుకెళ్లాలి. బీసీ నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్ గెలుపుతో బీసీల సత్తా చాటుదాం. బీసీ ప్రజాప్రతినిధులతోనే బీసీల సంక్షేమం, అభివృద్ధి సాధ్యం.

-కమ్మరి శ్రీనివాసచారి, సురంగల్, మొయినాబాద్

జ్ఞానేశ్వర్ గెలుపు.. బీసీల అభ్యున్నతికి మలుపు..

చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు వెనుక బడిన కులాల అభివృద్ధికి మలుపు. బడుగు, బలహీన వర్గాల గొంతుకైన జ్ఞానేశ్వర్‌కు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎంపీ టికెట్ ఇవ్వడం అభినందనీయం. అన్ని కులాల వారు పార్టీలకు అతీతంగా ఓట్లు వేసి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవాలి. అధికారం ఎక్కడ ఉంటే అక్కడ జంప్ చేస్తూ ప్రజలను మోసం చేస్తున్న బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని ఎవరు నమ్మరాదు. ఇప్పటికే కాంగ్రెస్ పాలనలో ఎన్నో కష్టాలు, నష్టాలను చూస్తున్నాం. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుంటే మన హక్కులను మనం సాధించుకోవచ్చు. ప్రజలందరూ కారు గుర్తుకు ఓటు వేయాలి.

-రాజుగౌడ్, తాండూరు

పార్టీలకతీతంగా మద్దతు తెలుపాలి..

96 కులాల బీసీ ఐక్య వేదికను ఏర్పాటు చేసి అందరిని ఒక్కతాటికి తీసుకువచ్చిన కాసాని జ్ఞానేశ్వర్ ఎంపీగా గెలిపించి పార్లమెంటుకు పంపుదాం. కేసీఆర్ బీసీలను గుర్తించి బీసీల ముద్దుబిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌కు చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి అవకాశం కల్పించడం చాల సంతోషంగా ఉన్నది. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలు కారు గుర్తుకు ఓటు వేసి కాసాని జ్ఞానేశ్వర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి. బీసీల శక్తి , చైతన్యం అంటే ఎట్లుంటదో కాసానిని గెలిపించుకొని రుజువు చేద్దాం. అందుకోసం నియోజకవర్గంలోని బీసీలందరూ పార్టీలకు అతీతంగా బీసీ అభ్యర్థికి మద్దతు తెలిపి గెలుపునకు కృషి చేయాలి.

-అనురాధ, తాండూరు

బీసీ నాయకుడికి పట్టం కడుదాం..

జనాభాలో బీసీల శాతం ఎక్కువగా ఉన్నా బీసీలకు సరైన న్యాయం జరుగడంలేదు. బీసీలకు రాజకీయాల్లో ఎదిగేందుకు ఇది మంచి అవకాశం. చేవెళ్ల గడ్డపై బీసీ అభ్యర్థిని భారీ మెజార్టీతో పట్టం కట్టి బీసీల బలం చూపాలి. ఎన్నో ఏండ్లుగా బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తూ తక్కువ శాతం ఉన్న వారు రాజ్యాధికారం చేపడుతున్నారు. చాలా రోజుల తరువాత బీసీ నాయకునిడి గెలిపించుకునే అవకాశం వచ్చింది. ఈ సారి బీసీలందరూ పార్టీలకు అతీతంగా ఉండి బీసీ నాయకునిడి గెలిపించుకోవాలి. సమాజంలో బీసీలకు తగిన గుర్తింపు ఇవ్వడం లేదు. బీసీల తరపున మాట్లాడే నాయకులే కరువయ్యారు. ఈసారి ఎంపీ అభ్యర్థిగా జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకొని బీసీల సత్తా చాటుదాం.

-శ్రీధర్‌గౌడ్, నాగారం, ధారూరు

బీసీల్లో మార్పు రావాలి..

బీసీల్లో ఐక్యత లేకుండా ఇతరులు కుట్రలు చేస్తున్నారు. అన్ని కులాల కంటే బీసీలు ఎక్కువ శాతం ఉన్నారు. బీసీలు ఐక్యంగా ఉండి మన నాయకుడిని మనమే గెలిపించుకోవాలి. బీసీలను ఓటు బ్యాంకుగా చూస్తూ రాజకీయాల్లో రాణించకుండా కుట్రలు పన్నుతున్నారు. బీసీలను చులకనగా మాట్లాడిన వారికి తగిన గుణపాఠం చెప్పాలంటే బీసీ అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉన్నది. ఎన్నో ఏండ్లుగా బీసీలు అణచివేతకు గురవుతూనే ఉన్నారు. రాజ్యాధికారం బీసీలకు రావాలంటే బీసీల్లో మార్పు రావాలి. కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకొని బీసీల ఐక్యతను చాటాలి.

-బ్రహ్మం , ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

బీసీల గొంతుక జ్ఞానేశ్వర్..

చేవెళ్ల పార్లమెంటు పరిధిలోని బీసీలందరూ ఒకేతాటిపైకి రావాల్సిన సమయం ఇది. గత మూడు దశాబ్దాలుగా బీసీల ఐక్యత, రాజ్యాధికారం కోసం పోరాటం చేస్తున్న బడుగుల గొంతుక కాసాని జ్ఞానేశ్వర్‌ను పార్లమెంటు పంపిద్దాం. బీసీ కులాల్లోని అందరూ కలిసికట్టుగా ఆయనకు మద్దతు ఇవ్వాల్సిన సందర్భమిది. రాజకీయాలకతీతంగా బీసీ కులాల అభివృద్ధి, ఐక్యత కోసం కృషి చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎంపీగా గెలిపిద్దాం.

-ఎస్.మాసయ్య, ఉమ్మడి కులకచర్ల మండల బీసీ యువత అధ్యక్షుడు

బీసీలమంతా ఒకటవుదాం..

పార్టీలకు అతీతంగా బీసీలమంతా ఏకతాటిపైకి వచ్చి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌ను గెలిపించుకుంటాం. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఎంతోకాలంగా కృషి చేస్తున్న కాసానిని గెలిపించుకుంటే బీసీల సమస్యలపై పార్లమెంట్‌లో గళం విప్పుతారు. ప్రజలకు అమలు కాని హామీలను చెప్పి మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని ఎంపీ ఎన్నికల్లో చిత్తుగా ఒడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ రాష్ట్ర హక్కుల కోసం పోరాడేది ఒక్క బీఆర్ఎస్ పార్టీ ఎంపీలే. బీసీలను చిన్నచూపు చూస్తున్న కాంగ్రెస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో కర్రుకాల్చి వాతపెట్టి బీసీల ఐక్యతను చాటాలి.

-రమేశ్ కురుమ, ఎన్టీఆర్‌నగర్‌వాసి

కాసానికి భారీ మెజారిటీ అందించాలి..

చేవెళ్లలో కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌కు భారీ మెజారిటీని అందించి బీసీల దమ్మోంటో చూపిస్తాం. చేవెళ్ల అడ్డ.. బీఆర్ఎస్ గడ్డ. గత రెండు సార్లు చేవెళ్లలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులే గెలుపొందారు. జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ టికెట్ కేటాయించడం అభినందనీయం. బీసీలకు పెద్దపీట వేస్తున్న బీఆర్ఎస్ పార్టీకు బీసీలమంతా రుణపడి ఉంటాం. కాంగ్రెస్, బీజేపీ పార్టీల నుంచి అగ్రవర్ణాలకు టికెట్లు ఇచ్చారు. బీఆర్ఎస ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బీసీ అభ్యర్థిని గెలిపించుకుందాం. కాంగ్రెస్, బీజేపీలు ఎన్ని జిమ్మికులు చేసినా జ్ఞానేశ్వర్ గెలుపును అపలేరు. బీసీలను కించపరుస్తూ మాట్లాడిన అగ్రవర్ణ నాయకుడికి తగిన బుద్ధి చెప్పాలంటే జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉన్నది.

-బండారు మల్లేశ్ ముదిరాజ్, ఆర్కేపురం వాసి

కాంగ్రెస్ నేతకు గుణపాఠం చెబుతాం..

ఏండ్ల తరబడి పాలించిన కాంగ్రెస్‌కు వెనుకబడిన వర్గాల సంక్షేమం ఏనాడు కనబడలేదు. నాటి నుంచి నేటి వరకు కేవలం వారిని ఓటు బ్యాంకు రాజకీయాలకే వాడి వదిలేశారు. అత్యంత కీలకమైన చేవెళ్ల పార్లమెంటు స్థానాన్ని బీసీలకు ఇవ్వకపోగా. ఇచ్చిన పార్టీలను నిందించటం ఏమాత్రం సరికాదు. బీఆర్ఎస్ తొలి నుంచి బీసీల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నది. తాజాగా చేవెళ్ల స్థానం టికెట్‌ను బీసీ బిడ్డ కాసానికి ఇచ్చి మరోసారి పెద్దమనస్సును చాటుకున్నది. ఈ ఎన్నికల్లో బీసీలంతా ఐక్యంగా నిలిచి కాంగ్రెస్‌కు గట్టి గుణపాఠం చెబుతాం.

పోతుల రాజేందర్ పటేల్

అహంకార కాంగ్రెస్‌కు చుక్కలు చూపిద్దాం..

ఆర్థికంగా రాజకీయంగా వెనుకబడిన వర్గాల రాజ్యాధికారంతోనే సమాజంలో మార్పులు సాధ్యం. ఆ దిశగా కృషి చేసే రాజకీయ పార్టీలకు అండగా నిలువాలి. పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల స్థానం టికెట్‌ను బీసీ వర్గానికి చెందిన కాసానికి ఇచ్చిన బీఆర్ఎస్ ఆ వర్గాలపై అభిమానాన్ని చాటుకున్నది. బీసీలంతా ఏకమైనా బీసీ అభ్యర్థిని గెలిపించుకోలేరని కాంగ్రెస్ నేత అహంకార పూరితంగా మాట్లాడటం సరికాదు. ప్రధానంగా ఈ ఎన్నికల్లో బీసీలంతా కలిసికట్టుగా ముందుకెళ్లి కాసానిని అధిక మెజారిటీతో గెలిపించుకోవాలి. ఏ పార్టీ బీసీలకు అనుకూలమో.. ఎవరు బీసీ పట్ల అహంకార పూరితంగా మాట్లాడుతున్నారో గుర్తించి గుణపాఠం చెప్పాలి.

-కృష్ణ ముదిరాజ్

బీసీ అభ్యర్థికే ఓటు వేయాలి..

రాజకీయాలకు అతీతంగా బీసీలంతా బీసీ అభ్యర్థికే ఓటు వేయాలి. బీసీలకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీలకు పట్టం కట్టాల్సిన అవసరం ఉంది. బీసీల ఐక్యత అంటే ఏమిటో ఈ పార్లమెంటు ఎన్నికల్లో చాటుదాం. బీసీల ఓట్లు లేనిదే ఏ పార్టీకి మనుగడ ఉండదు. కాంగ్రెస్ పార్టీ అహంకారానికి తగిన గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది.

-బోనకుర్తి రాము, మైలార్‌దేవ్‌పల్లి

బీసీ సేన సంసిద్ధం కావాలి..

చేవెళ్ల పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించేందుకు బీసీ సేన సంసిద్ధం కావాలి. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజారిటీ గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి బీసీ బిడ్డపై ఉన్నది. బీసీలను అవహేలన చేస్తున్న నేతలను ఓడించి తగిన బుద్ధి చెబుదాం.

-కోట పవన్‌కుమార్, మార్కండేయనగర్

అవకాశం సద్వినియోగం చేసుకోవాలి..

చేవెళ్ల పార్లమెంటు స్థానం జనరల్‌గా ఉన్నప్పటికీ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బీసీ నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను పార్టీ అభ్యర్థిగా పోటీ చేయించడం అభినందనీయం. బీసీలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలి. బీసీలను చులకనగా చూస్తున్న రాజకీయ పార్టీలకు, నేతలను ఓడించి మన సత్తా చూపిద్దాం.

-దోమ శ్రీశైలం, ముదిరాజ్ యువత పరిగి పట్టణ అధ్యక్షుడు